క్లుప్తంగా

న్యాయవాదుల నిరసన



తిరువూరు: అవనిగడ్డలో న్యాయవాదిపై కక్షిదారు దాడి చేసిన సంఘటనకు తిరువూరు బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం నిరసన తెలిపారు. కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు తమకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. దాడి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తిరువూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంకురాత్రి జనార్దన్, అంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

చంద్రగూడెం(మైలవరం): గ్రామాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుకుందామని సర్పంచ్ బొలగాని శ్రీనివాసరావు తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంలో సోమవారం సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వార్డుల్లో తిరిగి డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో తడి, పొడి చెత్తను రెండు వేర్వేరు డస్ట్‌బిన్లలో వేసి, పంచాయతీ సిబ్బంది వచ్చినపుడు వారికి అందజేయాలన్నారు. సచివాలయ కన్వీనర్ రాజులపాటి నాగరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలను పొందాలి



చాట్రాయి: విధి నిర్వహణలో పోలీసులు ప్రజల మన్ననలను పొందాలని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి బదిలీ అయిన సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను పోలీసులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, సీఐ అంక బాబు, ఎస్సై స్వామి పాల్గొన్నారు.

ఎంఈఓగా రాజశేఖర్ బాధ్యతలు



విస్సన్నపేట: విస్సన్నపేట ఇన్‌చార్జి ఎంఈఓ-1గా కె.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎ కొండూరు మండలం ఎంఈఓ-1గా పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ఆయన విధుల్లో చేరారు. రాజశేఖర్‌కు ఎంఈఓ-2 సుధాకర్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

స్కూల్ బస్‌లు నియమిత వేగంతో నడపాలి



మైలవరం: స్కూల్, కళాశాలల బస్ డ్రైవర్లు విధిగా యూనిఫామ్ ధరించాలని, నియమిత వేగంతో మాత్రమే వాహనాలు నడపాలని ఏసీపీ ఎం.రమేష్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో మైలవరం పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ రమేష్ ఆధ్వర్యంలో మైలవరం, రెడ్డిగూడెం, రెడ్డిగూడెం మండలాల పాఠశాలలు, కళాశాలల బస్ డ్రైవర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. రోడ్డు, విద్యార్థి భద్రత అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమిత సంఖ్యలోనే విద్యార్థులను వాహనంలో అనుమతించాలన్నారు. మద్యం, ఇతర మత్తు పదార్థాల తాగి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్, రెగ్యులేషన్స్ పాటించాలని తెలిపారు. స్కూల్, కళాశాల బస్‌లలో డ్రైవర్‌కు తోడుగా మరో వ్యక్తిని నియమించాలని తెలిపారు. లైసెన్స్ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించాలని, వారిపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేకుండా చూడాలన్నారు. అనంతరం పై నిబంధనలు పాటిస్తామని డ్రైవర్లతో ప్రమాణం చేయించారు. సీఐ మోహన్‌రెడ్డి, మూడు మండలాల ఎస్సైలు హరిప్రసాద్, ధర్మరాజు, శ్రీను పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు

ఆగిరిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10గంటలకు ఈదులగూడెంలో రైతుభరోసా కేంద్రాన్ని, 10.30 గంటలకు చొప్పరమెట్లలో గ్రామ సచివాలయ భవనాన్ని, ఉదయం 11గంటలకు నర్సింగపాలెంలో రైతుభరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ప్రారంభించనున్నారు. ఇదే గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు.

'గడప గడప' నిధులతో గ్రామీణరోడ్లకు మహర్దశ

రూ.5.5 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణం

తిరువూరు: గత ప్రభుత్వంలో బురదతో నిండిన అంతర్గత రహదారులపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణతో తిప్పలు తప్పాయి. ఎమ్మెల్యే రక్షణనిధి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఏడాది కాలంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు సూచించిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. తిరువూరు మండలంలోని 17 సచివాలయాలు, తిరువూరు నగర పంచాయతీలోని 10 వార్డు సచివాలయాలకు కలిపి రూ.5.40 కోట్ల మేర మంజూరైన గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది.

27 తిరువూరు మండలంలో సచివాలయాలు

రూ.**5.40** కోట్లు మంజూరైన గడప గడపకు మన ప్రభుత్వ నిధులు

90 నిర్మాణం జరుగుతున్న సీసీ రహదారులు



తిరువూరు మండలం ఆంజనేయపురంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రహదారి

సత్వరం బిల్లుల మంజూరు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద నిర్మించే సీసీ రహదారుల బిల్లులను సైతం అధికారులు సత్వరం మంజూరు చేస్తున్నారు. తిరువూరు మండలంలోని ఆంజనేయపురం, వావిలాల, పెద్దవరం, ఎర్రమాడు, కోకిలంపాడు, లక్ష్మీపురం, కొమ్మిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంతర్గత రహదారులకు మోక్షం కలిగింది. నాణ్యతా ప్రమాణాలతో నిర్మితమవుతున్న రహదారులతో గ్రామీణ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాలకు వెళ్లినపుడు ప్రజలు చెప్పిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అధికశాతం రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చాం. సీసీ రోడ్లను నిర్మిస్తే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. అన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

– కే రక్షణనిధి, తిరువూరు ఎమ్మెల్యే

సమస్య పరిష్కారం



పంచాయతీ, జెడ్పీ నిధులతో రహదారుల నిర్మాణం చేపట్టడానికి ఇబ్బందులు ఎదురవుతున్న దశలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు మంజూరవడంతో ఎస్సీ కాలనీలలో రహదారుల సమస్య పరిష్కారం అయింది. కాలనీవాసులు రోడ్ల నిర్మాణంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– మామిడి కుటుంబరావు, సర్పంచ్, ఆంజనేయపురం

బురదగుంటల నుంచి విముక్తి



వర్షాకాలంలో గోతులమయమైన రోడ్లపై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడేవాళ్లం. మురుగుగుంటల్లో పడి పిల్లలు, వృద్ధులు గాయాలపాలవుతుండటంతో రోడ్లు నిర్మాణం జరపాలని పలుమార్లు అధికారులను కోరాం. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో మా రహదారులు బాగుపడ్డాయి.

– కర్ని నాగమణి, ఆంజనేయపురం

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి మా గ్రామంలో పర్యటించడం, ఏదో ఒక కార్యక్రమం పెట్టి వెళ్లిపోవడం తప్ప మేము అడిగిన సమస్యలను పట్టించుకోలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే మేము అడిగిన వెంటనే రోడ్లు మంజూరు చేశారు. కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– జున్ను మరియమ్మ, ఆంజనేయపురం

సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరుకావాలి

ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: అధికారులు సమగ్ర సమాచారంతో సమావేశాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్‌కు నాలుగేళ్లలో గ్రామంలో సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.2.86కోట్లు ఇచ్చినట్లు ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే ప్రతాప్ అది ఎంతమాత్రం కరెక్ట్ కాదని, సరిగా అన్ని పథకాలు కేటాయించిన నిధులు కలిపి చెప్పాలన్నారు. కేవలం పింఛన్లకే నాలుగేళ్లలో గ్రామానికి రూ.4 కోట్లను ప్రభుత్వం అందజేస్తే తప్పుడు వివరాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని, సరైన సమాచారంతో రావాలని సూచించారు.

విస్తృత స్థాయిలో సంక్షేమ పథకాలు

ఆంధ్రప్రదేశ్‌లో క్యాలెండర్ ప్రకటించి దాని ప్రకారం సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇలా అమలు చేయడం లేదని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. నాలుగేళ్ల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజలకు రూ.14 కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు అందిస్తున్నారన్నారు. వలంటీర్లు ఎంతో కష్టపడి ప్రజలకు సేవ చేస్తుంటే కొందరు ప్రతిపక్ష నాయకులు నోటికిష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారిని ప్రజలందరూ నిలదీయాలన్నారు. చంద్రబాబు బెంజి కారు, కిలో బంగారం ఇస్తామన్నా ప్రజలు నమ్మబోరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ శిరీష, సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రేమసాయి, రాంబాబు, డీటీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ముక్కొల్లుపాడులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రతాప్ అప్పారావు

ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలి

మైలవరం: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరేందుకు ముందుకు రావాలని ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్ పేర్కొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ తృతీయ, ఫైనల్ ఇయర్ 10 మంది విద్యార్థినులకు కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు లక్ష్మణ్, కుందన్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సమక్షంలో సీ సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కుందన్, లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగం ద్వారా రక్షణ దళంలో, దేశ సరిహద్దులలో పురుషులతో పాటు మహిళలకు కూడా మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థినులకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి చాలా సులభతరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ ఆర్.పవిత్ర పాల్గొన్నారు.



ఎన్‌సీసీ విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేసిన శ్రీనివాసరెడ్డి, డాక్టర్ అప్పారావు, లక్ష్మణ్ కుందన్

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలి

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో ఎనిమిది అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం వాటిని సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని, పరిష్కార నివేదికకు లబ్ధిదారుల సమస్యకు సంబంధించిన ఫొటోలను జతచేయాలని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు.

ఆర్డీఓకు వినతులు

తిరువూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. తిరువూరు ఆర్టీసీ బస్టాండు నుంచి బైపాస్‌రోడ్డుకు వెళ్లే రహదారి గోతులమయమై బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నందున పునర్నిర్మాణం జరపాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. రైతాంగ సమస్యలపై కూడా విజ్ఞప్తులు అందినట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు.



నూజివీడులో అర్జీలను తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

'స్పందన'లో ఆరు దరఖాస్తులు

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన'లో ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ నర్సింహారావు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పూర్వీకుల నుంచి దళారులు అక్రమంగా స్వాధీనం చేసుకున్న వ్యవసాయ భూములు తమకు తిరిగి ఇప్పించాలని కేతనకొండ ఎస్సీ రైతులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాసరావుకు సోమవారం స్పందనలో వినతిపత్రం అందజేశారు. శేషం ఆమోసు, ఎం.యోహాను, పౌలు, మనోహర్, పాపారావు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రతి గ్రామంలో వెల్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించిందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని ముక్కొల్లుపాడులో రూ.21 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకున్న నాథుడే లేడన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు అనేక వైద్య సదుపాయాలను కల్పిస్తోందన్నారు. 104 వాహనాల ద్వారా ప్రతి గ్రామంలో వైద్యాన్ని అందించడంతో పాటు మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నారన్నారు. వెల్‌నెస్ కేంద్రాల్లో సుమారు 102 రకాల మందులను అందుబాటులో ఉంచుతోందన్నారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలే కాకుండా ఎంఎల్‌హెచ్‌పీని నియమించి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సైతం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. నూజివీడులోని ఏరియా ఆస్పత్రిని రూ.21.25 కోట్లతో ఆధునీకరిస్తామన్నారు. దీనిని 200 బెడ్ల ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు నిర్వహిస్తూనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, మధ్యతరగతి వర్గాల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో విద్యా మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ శిరీష, సర్పంచి సుబ్బలక్ష్మి, దిగవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఓ అర్జునరావు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, నాయకులు ప్రేమసాయి, రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వెల్‌నెస్ కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఎంఎల్‌ఎస్ పాయింట్ తనిఖీ



మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డులోని రేషన్ బియ్యం మెయిన్ లిఫ్టింగ్ పాయింట్‌ను ఎన్టీఆర్ జిల్లా సబ్ కలెక్టర్ అదితి సింగ్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అదితిసింగ్ రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. రికార్డులు తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ వెంట మైలవరం తహసీల్దారు శ్రీనివాస్, డీటీ, సివిల్ సప్లైస్ మాధవి ఉన్నారు.

తోలుకోడు సొసైటీ అధ్యక్షుడిగా జగదీష్

తోలుకోడు(మైలవరం): మైలవరం మండలం తోలుకోడు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా కమదన జగదీష్ నియమితులయ్యారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామం సొసైటీ అధ్యక్షుడిగా జగదీష్‌ను నియమిస్తూ సొసైటీ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతగా పదవి అప్పగించిన మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ జిల్లా అధ్యక్షుడు తన్నీరు నాగేశ్వరరావు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి అభినందన

విస్సన్నపేట: స్థానిక సిద్దార్థ హైస్కూల్లో పదోతరగతి చదివిన విద్యార్థి గద్దల నవదీప్ కుమార్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్ మేడా హర్షా సోమవారం తెలిపారు. ఆ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణకుమార్ పాల్గొన్నారు.

జవాబుదారీ పాలన జగనన్న లక్ష్యం



కాట్రేనిపాడులో ధ్రువపత్రాల పంపిణీ



నూజివీడులో మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు

ముసునూరు: కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యం అని ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన సోమవారం కాట్రేనిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమ గ్రామ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 866 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలను అర్హులు నష్టపోవడానికి వీల్లేదని, అందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. అర్హతలు ఉండి పథకాలు పొందని వారి మేలు కోసం వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించడం గొప్ప విషయమన్నారు. జవాబుదారీ పాలన ముఖ్యమంత్రి జగన్‌కే సాధ్యమైందన్నారు. వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, సర్పంచ్ సుహాసిని, ఎంపీడీఓ జి.రాణి, డీటీ ఎమిలీ కుమారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ధంధంగార్డెన్‌లోని వార్డు సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 364 సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ మాట్లాడుతూ వలంటీర్ల సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. వలంటీర్ల వ్యవస్థను విమర్శించడం అనాగరిక చర్యని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్ ప్రియాంక, నాయకుడు ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

మండలంలోని కొత్త ఈదర సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ అనూష మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయం పరిధిలోని కొత్త ఈదర, సీతారామపురం గ్రామస్తులకు సంక్షేమ పథకాల రూపంలో రూ.18 కోట్లను ప్రభుత్వం అందజేసిందన్నారు. వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకుంటేనే ఈ పథకాలన్నీ అమలవుతాయన్నారు. చంద్రబాబును నమ్ముకుంటే రాష్ట్రం అధోగతేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 393 సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు అందజేశారు. పెరిక కార్పొరేషన్ డైరెక్టర్ పార్వతి, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీఓ పీ శంకరరావు, సీతారామపురం సర్పంచి మురళి పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో నవగ్రహ హోమం

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం ఆషాఢ అమావాస్య సందర్భంగా నవగ్రహ హోమం, లక్ష్మీపతి గణపతి హోమం, విశేష అర్చనలు పూజలు జరిగాయి. వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమాలు నిర్వహించారు. అలాగే బాబాకు ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్లమూడి వీరమోహనరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు సురక్ష క్యాంపులు

ఊటుకూరు/కొణిజెర్ల(గంపలగూడెం): గంపలగూడెం మండలంలోని రెండు గ్రామాలలో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. కొణిజెర్ల, ఊటుకూరు-1 సచివాలయాలలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ ధ్రువీకరణ పత్రాలు కోరుతూ దరఖాస్తులు ఇచ్చిన వారికి క్యాంపులో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక సచివాలయం-2, సచివాలయం-4 వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ సోమవారం తెలిపారు. ఆయా సచివాలయ కార్యాలయాల వద్ద ఉదయం 9.30 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: కొటికలపూడి గ్రామ సచివాలయం (కేతనకొండ-2) వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన సంక్షేమ పథకాల అర్హులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తిరువూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని తిరువూరు ఒకటో వార్డులో మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే కే రక్షణనిధి ఉదయం ఏడు గంటల నుంచి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని రోలుపడిలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

పొదుపు సంఘాల భాగస్వామ్యం అవసరం

ముసునూరు: గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణలో పొదుపు సంఘాలు భాగస్వామ్యం వహించాలని జలజీవన్ మిషన్ జిల్లా కో-ఆర్డినేటర్ శిరిగిరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని లోపూడి శివారు బాసవరప్పాడులో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బాబు అధ్యక్షతన డ్వాక్రా సంఘాలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జల జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటింటికీ కుళాయి కార్యక్రమాన్ని కమ్యూనిటీ కాంట్రాక్టు పద్ధతిలో నిర్వహించేందుకు డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పేరం కృష్ణ, ఉపసర్పంచ్ మువ్వా బాబూరావు, డీపీఎం ఎండీ నవాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ పాల్గొన్నారు.